పశ్చిమ దిశంతా రంగుల యింద్రజాలంతో అద్భుతంగావుంది,

స్వరాజ్యం నన్నజాజి మొగ్గలు కోసుకుని పెరట్లోంచి లోపలికి రాబోతూ-పక్కవాటాలో కన్పించిన దృశ్యం చూసి ఆగిపోయింది.

సుందరి పొయ్యిగట్టు ముందు నిలబడి ఏదో వొండుతూంది. ఆమె వెనుక నిల్చున్న సుబ్బారావు ఆమె మెడ చుట్టూ రెండు చేతులూ పెనవేసి మొహం ఆమె భుజం మీద ఆన్చి ఏదో గుసగుసలాడుతున్నాడు.

సుందరి ఏదో తినే పదార్థం అతని నోటికందించింది. అతనుపంటితో దాన్ని కొరికి పట్టుకునే ఆమెను తనకు అభిముఖంగా తిప్పుకున్నాడు. ఆమె అతని కళ్ళలోకి చూస్తూ సుతారంగా పెదవులతో ఆ పదార్థాన్ని అందుకుంది. సుబ్బారావు ఆమె నడుం చుట్టూ చెయ్యి వేసి దగ్గరకు తీసుకుని—

ఇక ఆగలేదు స్వరాజ్యం. గబగబా లోపలికి కొచ్చి తలుపు మూసేసింది.

మనసంతా తనకే తెలియని విధంగా అయిపోయింది'

వొడిలోని నన్నజాజులు గచ్చు నేల మీద జారిపోయినయ్. ఏమీ తోచనట్టు ఆరెండు. గదుల్లోనూ అట్నుంచి యిటూ, యిట్నుంచి అటూ తిరిగింది కాసేపు.

గోడకున్న అద్దం ముందు నిలబడి కాస్సేపు ముఖంచూచుకుంది.

వెళ్ళి మంచంమీద వాలి పోయింది.

పక్కవాటాలోకి సుందరీ సుబ్బారావూ వొచ్చిందగ్గర్నుంచి రాజ్యం మనసు కుదురుగా వుండటంలేదు.

ఆ వాటాలో వాళ్ళుదిగి వారమైంది.

రెండు రోజుల క్రితం—

మధ్యాహన్నం రెండు గంటల వేళ సుందరి పంపు దగ్గర బట్టలుతుక్కుంటూంది.

అతనుఎప్పుడొచ్చాడో, పిల్లిలా మెల్లగా ఆమె వెనక్కు వెళ్ళి నిలబడి తలవంచుకుని బట్టలకు సబ్బు పెడుతున్న ఆమె మెడమీద చటుక్కున ముద్దు పెట్టుకున్నాడు,

అదాటుగా వున్న సుందరి వులిక్కిపడి కెవ్వున అరవబోయి అంతలోనే అతన్ని చూసి ఆగిపోయింది. కళ్లల్లోకి కోపం తెచ్చుకుని

'ఏయ్. దొంగా! వుండు నీ పని చెప్తాను' అని సబ్బు చెయ్యి అతనికి

# వెలుగు రేఖ

—చీర్ల సీతాదేవి

పూయటానికి లేచింది అతను లోపలికి పరుగెత్తాడు.

సుందరి అతన్ని తరుముకుంటూ పరుగెత్తింది.

ధన్ మంటూ తలుపులు మూత పడినాయి.

లోపల్నుంచి కిల కిలనవ్వులు.— మాటలు....

బయట పంపుకింద బకెట్-అందులో సబ్బు రాసిన బట్టలు.

ఆమె అందులో పడేసిపోయిన కొత్త రిన్ సబ్బు.

వాటిమీదధారగా పడుతున్న పంపు నీళ్ళు-

వంటింటి కిటికీలోంచి చూస్తూ అట్లా ఎంతోసేపు నిలబడిపోయింది స్వరాజ్యం. టాంకు ఖాళీఅవుతే మళ్లా రేపటికి నీళ్ళుండవన్న స్పృహ చటుక్కునవచ్చి, తలుపు తెరచుకుని వెళ్ళి పంపు కట్టేసి వచ్చింది.

పక్కవాటాలోంచి నవ్వులు....గాజుల గలగలలు....

అప్పుడప్పుడూ మాటలు వినబడుతూనే వున్నాయి.

గడియారంవేపు చూస్తూ అశాంతితో ఆలోచనలతో గడిపివేసింది మళ్ళీసుందరీ వాళ్ళ వాటా తలుపులు తెరుచుకునే వరకూ.

నిన్నకాక మొన్న అలా చూసింది ఆ యిద్దర్నీ.

యీ రోజు ఇలా.

ఎంత అన్యోన్య దాంపత్యం?

తను సరిగ్గా మూర్తితో ఇలా ఉండాలనేగా కోరుకునేది.

అయితే శృంగారాన్ని అపురూపమైన కళగా మార్చుకుని అనుభవించటం చేత గాని మనిషి మూర్తి.

'పొట్టి బుద్ధావతారం' అనుకుంది.

మంచంమీదగోడకి ఆనుకునికూర్చుని నేలమీద కుప్పగా పడున్న పూలకేసి చూస్తూ, తన బాల్యాన్ని, నిస్సారమైన తన రెండేళ్ళ కాపురాన్నీ సింహావలోకనం చేసుకుంటున్న దానిలాగా కూర్చుండిపోయింది.

చెంచయ్యకు ముగ్గురు కొడుకుల తర్వాత పుట్టింది స్వరాజ్యం గారాబంగా ఆడిందిఆటగా పాడింది పాటగాపెరిగింది.

సినిమాలూ, స్నేహితులు, పుస్తకాలు అంటే ప్రాణం పెట్టేది.

అన్నగారికోసంవచ్చిన స్నేహితులతో నిర్భయంగా నిస్సంకోచంగా మాట్లాడేది.

ఫేషన్ల బట్టలు ధరించటం, నీట్‌గా తయారై బడికి వెళ్ళటం, స్నేహితులతో కలిసి కనిపించిన వాళ్ళనల్లా ఏడిపించటం తప్ప చదువుమీద ధ్యాసలేదు స్వరాజ్యానికి.


తల్లి ఉబ్బసంరోగి. యింట్లో వంటా వార్పూ విధవ మేనత్త చూసుకునేది.

రాజ్యానికి పదహారో ఏడు వొచ్చిందగ్గర్నుంచీ 'యిక దానికి చదువుచాలు. పెళ్ళి చేసెయ్యి' అంటూ తమ్ముడ్ని సాధించటం మొదలు పెట్టింది ఆవిడ.

తల్లి కూడా కొడుకులమాట ఎలా ఉన్నా రాజ్యంపెళ్ళిచూసి కన్నుమూసినా చాలనుకునేది.

అప్పుడే చెంచయ్య సంబంధాలు చూడటం మొదలు పెట్టాడు.

పెళ్ళని తెలిసింది మొదలు కలలు కనటం మొదలుపెట్టింది రాజ్యం.



ఏ సంబంధం తెచ్చినా యితను షరీ నలుపనీ, అతను మరీ తెనితెలుపనీ. ఒకతను సరైన మాచింగు బట్టలు వేసుకోలేదనీ, ఒకతను బూట్లు ధరించకుండా హవాయి చెప్పుల్తో వొచ్చాడనీ యిట్లా వంకలు పెడుతూ వుండేది.

మేనత్త, తల్లి, చివరికి తండ్రికూడా వినిగిపోయారు.

రెండేళ్ళ తర్వాతవచ్చింది రామ్మూర్తి సంబంధం.

మనిషి సింపుల్‌గా స్మార్ట్‌గావున్నాడు. చూడగానే నచ్చాడు రాజ్యానికి. అయితే అతని వివరాలు విని ముఖం మాడ్చుకుంది.

చదువు పెద్దగాలేదు. ఒక ప్రయివేటు నర్సింగ్ హోమ్‌లో కాంపౌండరుగా చేస్తున్నాడు.

వొద్దనేసింది. అంతాకలిసి నచ్చజెప్పారు

'ఒక్క ఆడపిల్లవని నిన్ను అపురూపంగా పెంచామే. నువ్వుకోరిన సంబంధం తెచ్చి చెయ్యటానికి మేమేం లక్షాధికార్లం కాదు. ఈ ఉన్న అడితీయే ఆధారం. ఇంకా అన్నయ్యల చదువులున్నాయి. ఇతను మంచి వాడు. బుద్ధిమంతుడు. వెనకాల కాస్తో కూస్తో ఆస్తి వున్నవాడు. ఇంకా చిన్నవాడేగనుక వృద్ధిలోకివస్తాడు. లేదా ఏ వ్యాపారమో చేసుకుంటాడు. ఇంత అనుకూలమైన సంబంధం మళ్ళీ మళ్ళీ రాదు. అత్తమామలుకూడా మంచి వాళ్లు" అంటూ నచ్చజెప్పి వొప్పించి పెళ్ళిచేశారు.

పెళ్ళవగానే ఓ రెండుగదుల వోర్షను చూసుకుని నెలలోపే కాపురం తెచ్చుకున్నాడు రామ్మూర్తి రాజ్యానికి ఆ ఇల్లు నచ్చలా. పెళ్ళికిముందు వూహించుకున్న ఇంటికీ దీనికీ ఎక్కడా పోలికలేదు.

ఎవరన్నా వొస్తే కూర్చునేదీ. వడు

కునేదీ అన్నిటికీ ఆ ఒక్క గదే. రెండోది వంటకీ తిండికీ వంటగది తలుపుతీస్తే రెండు పోర్షన్లకీ కామన్ బాత్‌రూమ్-పైపు బట్టలుతుక్కోవటానికీ ఆరేసుకోవటానికీ చిన్న వెరడు. ఇంటిముందు కొద్దిగా ఖాళీ స్థలం, గోడ. గేటుకి ఇటొకటి ఇటొకటి కొబ్బరిచెట్లు.

ఇలు చూసి "ఇంకా నయం పక్క వాటాలో ఎవరూ లేరు" అనుకుంది.

మర్నాటినుంచే రామ్మూర్తి డ్యూటీలో చేరాడు.

ఉదయం లేవగానే కాలకృత్యాలు తీర్చుకుని ముందు తలుపులు బంధించుకుని కాసేపు ఆసనాలు వేస్తాడు. తర్వాత స్నానం టిఫిన్ చేసుకుని సైకిలెక్కి హాస్పిటల్‌కి వెళ్ళిపోతాడు వెళ్ళేముందు మధ్యాహ్నం భోజనానికి వస్తానని చెప్పి వెడతాడు.

హాస్పిటల్‌లో మూర్తికి పూర్తిగా పని పేషెంట్లకు మందులు యింజక్షన్లు యివ్వటం వసూలైన డబ్బు డాక్టరుగారికి అప్పగించటం - యిలా ఎన్నో-

డాక్టరుగారికి మూర్తి మీద మంచి అభిప్రాయం వుంది. అందుకే తానులేని సమయాల్లో నిశ్చింతగా హాస్పిటల్ బాధ్యత మూర్తిమీద పెడతాడు.

మధ్యాహ్నం తన కోసం రాజ్యం చూస్తూ వుంటుంది వెళ్లాలని ఆలోచన వున్నా పని తెములక బాయ్‌తో కాఫీ తెప్పించుకు తాగి సరిపుచ్చుకుంటాడు.

నాలుగు గంటల ప్రాంతంలో యింటికొస్తాడు. రాజ్యం యిచ్చిన టీ తాగి స్నానం చేసి బట్టలు మార్చుకుని రాజ్యం అడిగే వాటికి జవాబు చెప్తూనే హడావుడిగా తయారై మళ్ళా హాస్పిటలు చేరుకుంటాడు.

మళ్ళీ రాత్రి పదికే రాక.

పగలంతా ఆతనికోసం ఎదురు చూస్తూ వుంటుంది రాజ్యం.

రాత్రి నిద్ర కళ్ళతో తలుపు తెరుస్తుంది.

అతను లోపలికివొచ్చి బట్టలు మార్చుకుని పీట వాల్చుకుని కూచుంటాడు.

రాజ్యం కోపంతో ముభావంగా వడ్డిస్తుంది.

ఆకలితో వుంటాడేమో అతను ఆవురావురు మంటూ తినేసి పేపరు పట్టుకుని పడక్కుర్చీలో కూర్చుంటాడు.

కళ్ళు మూతలు పడుతుంటే కోపంతో వుక్రోషంతో రాజ్యం అతన్ని 'లేవండి. పడుకుందురు గాని అంటూ మంచం వరకూ చేయి పట్టుకుని నడిపించుకు వెళ్తుంది. లైటార్పి అతని పక్కన చేరుతుంది.

నిద్ర కళ్ళతోనే భార్యను దగ్గరకు తీసుకుంటాడు....

తెల్లవారుతుంది.

ఇలాంటి దినచర్యతో వారం రోజులు గడిచే సరికి రాజ్యానికి మతి పోయింది.

పెళ్ళంటే ఒక రోజు సంబరమా? తాను ఎన్ని కలలు కంది?

ఎన్ని వూహించుకుంది. అతనితో సినిమాలు-షికార్లు-కబుర్లు- స్వేచ్ఛగా, గూటిలోని గువ్వల్లాగా, గాలిలో పక్షుల్లాగా వుండాలనుకుంది.

వుదయం నుంచి రాత్రి పది గంటల వరకూ యీ రెండు గదుల్లో గడ

పాలంటే పిచ్చెక్కిపోదూ ఊహల్లో టెక్నికలర్లా కనిపించే కాపురం వాస్తవంలో బ్లాక్ అండ్ వైట్లా కన్పించే సరికి మతి పోయింది

తనభర్తకు తనకన్న, ఆహాస్పిటలూ మందులూ రోగులూ అవే ప్రియమైన వన్న భావనతో ఆమెలో మంటలు రేగాయి మనసులో'' యితన్ని యిలా వొదిలేసి వూరకోగూడదు తనకు నచ్చేలా తీర్చి దిద్దుకోవాలి అన్న నిశ్చయానికి వొచ్చింది

మర్నాడు వుదయం- అతని చేతికి ౦న్ ప్లేటుఇచ్చి-కుర్చీ చేతిమీదకూచుని మూర్తీ ఇంట్లో నేనొక్కదాన్నే రాత్రి వరకూ వుండాలంటే తోచటంలేదు'అంది అతని క్రాపు సరిచేస్తూ

మూర్తి తెల్లపోయాడు నిన్నటివరకూ 'ఏమండీ' అంటూ పిలిచిన స్వరాజ్యం వున్నట్టుండి పేరుతోపిలుస్తుంటే అదోలా ఫీలయ్యాడు తన తల్లి ఇలా తనకు తెలిసిన ఆడవాళ్ళంతా భర్తని ఏమండీ అని మన్నిస్తూపిలవటమే అతనికితెలుసు

మరి రాజ్యం చదువుకున్నపిల్ల పోన్లే తననోటితో పేరుపెట్టి పిలుస్తేనేబాగుంది అనుకుని సమాధాన పడ్డాడు

''ఏవైనా బుక్స్ తెమ్మంటావా?" అన్నాడు

"ఉహు ఎన్ని పుస్తకాలైనా గంటలో చదివి పారేస్తాను తర్వాత? రోజంతా ఎట్లా?"

చాలా విచారం ధ్వనించింది రాజ్యం గొంతులో

అతను తలతిప్పి రాజ్యంవైపు చూశాడు

రాజ్యం అతని కళ్ళలోకి ఎంతెన కద్దున్నట్టు ప్రేమగా చూసింది

అతనిమనస్సు క్షణం వశంతప్పింది

చటుక్కున ఎడంచెయ్యి ఆమెనడుం చుట్టూ పోనిచ్చి దగ్గరకు లాక్కుని అందినచోటల్లా ముద్దుపెట్టుకున్నాడు

ఆనందంతో పారవశ్యంతో పులకించి పోయింది రాజ్యం

కొనగోటి స్పర్శతో నాదాలు వలికే వీణలావుంది ఆమె తనువూ, మనసూ

''మూర్తి ఈరోజు ఉండిపోరాదూ?"

అతని కప్పుడు టైము, డ్యూటీ గుర్తుకొచ్చాయి

రాజ్యాన్ని వొదిలేసి టిఫిన్ అందుకుని త్వరగా తినటం మొదలుపెట్టాడు. 'ఎలా వీలవుతుంది' అంటూ

"ఎలా ఏమిటి? వీలు చేసుకుంటే అదే అవుతుంది''

"మన కాలక్షేపం కోసం ఎదుటి వాళ్ళని ఇబ్బంది పెట్టకూడదు రాజ్యం నీకు తోచక పోతే మళ్ళా టెంకుకికట్టు"


"ఉహూ నేను పరీక్ష తప్పించిచదవ లేక కాదు ఇంట్రెస్టులేక"

అయితే మహిళామండలికి వెళ్లు కుట్లూ అవీనేర్చుకోవచ్చు లేకపోతే ఏవయినా పిండివంటలు చెయ్యి మీవాళ్ళ ఇంటికి వెళ్ళివస్తూండు"

అతను చెయ్యి కడుక్కున్నాడు

''ఫో నువ్వుచెప్పినవేవీ నాకునచవు'' అంటూ అతని తలను చేత్తో వెనక్కు నెట్టి లేచిపోయింది

అతను కుర్చీమీది తుండు అందుకుంటూ రాజ్యంవేపు ఆశ్చర్యంగా చూశాడు



తమిళ పాటలైతే- ఇంట్లో పిల్లకాయలు ట్యూను విని ఆనందిస్తారని, ఇలాంటి అర్థాలు కల్పించుకోకుండా

ఇంతకన్న ఏం కాలక్షేపం కావాలి?

అతని వుద్దేశం వుద్యోగాలు చెయ్యని ఆడవాళ్ళంతా తన తల్లిలా యింటి పన్లు చూసుకుంటూ వుంటారని.

రామ్మూర్తి తండ్రి బడిపంతులు. బడి అయ్యాక సాయంత్రాలు రావిచెట్టు కింద చప్టామీద కూచుని పిల్లలకి ప్రయివేట్లు చెప్పేవాడు. ఆతర్వాత కాసేపు అక్కడ చేరిన వాళ్ళతో కాలక్షేపం చేసి యింటి కొచ్చేవాడు.

రామ్మూర్తికి బడి, ఆటలు- సరి పోయేవి.

అతని తల్లి ఏప్పుడూ పాతబట్టలు కుడుతూనో, బియ్యం ఏరుకుంటూనో, యిల్లు బాగుచేస్తూనో పాదులు సరి చేస్తూనో కన్పించేది. అప్పుడప్పుడూ మంగవాళ్ళఇంటికివెళ్తే నలుగురైదుగురు ఆడవాళ్ళతో అప్పడాలు చేస్తూనో, ముచ్చట్లు చెప్తూనో కన్పించేది.

అతనికి రాజ్యం ధోరణి వింతగా తోచింది.

ం ం ం

రామ్మూర్తి గడ్డం చేసుకుంటున్నాడు అప్పుడే స్నానం చేసి వొచ్చిన రాజ్యం అతని దగ్గరగా వెళ్ళి,

మీసాలు పెంచితే నువ్వెంతో బాగుం టావు మూర్తీ ' పెంచుకోరాదూ" అంది.

వెనక నిల్చున్న ఆమెను ఒక్కసారి అద్దంలోంచిచూసి మళ్ళీ తనలో నిమగ్న మయ్యాడు మూర్తి,

'మా అత్తయ్య మీసాలులేని మగాడికి రోషం వుండదంటుంద'

నవ్వుతూ చెప్పిన రాజ్యానికి,

"అయితే నీకే మంచిదిగా" నవ్వు తూనే జవాబిచ్చి తుండు భుజానేసుకుని పెరట్లోకి వెళ్ళి పోయాడు.

రాజ్యం ముఖం ముడుచుకుని కూర్చుండి పోయింది.

పది నిముషాల్లో అతను స్నానం చేసి వొచ్చి బట్టలు వేసుకుని తయారవు తుంటే 'మూర్తీ ఆపొడుగు చేతుల చొక్కా ఆ పాంటు ఏమిటి? 'చక్కా బెల్ బాటమ్‌పాంటు వేసుకుని టక్ చేసుకుంటే బాగుంటావు, ఎంచక్కా అవి కుట్టించు కోరాదు' అంది అతన్నే చూస్తూ తల చిక్కు తీసుకుంటూ

'నేను చేసే వుద్యోగానికి షోకిల్లాలా తయారై వెడితే బాగోదు' మూర్తి వాటినీ ధరించి చెప్పుల్లో కాళ్లు దూర్చాడు

'ఏం' మీడాక్టరుగారు బెల్ పాంట్లూ బొమ్మల షర్టులూ వేసుకోవటం లేదూ?

అప్పటికే మూర్తి సైకిల్ గేటు దాటింది

రోజులు గడుస్తున్నాయి

అతనిలో అతని దిన చర్యలో మార్పు తేవాలని రాజ్యం ప్రయత్నిస్తూనేవుంది

అతను ఏరోజూడ్యూటీకి ఆలస్యంగా వెళ్ళడు రాజ్యం వేళకు టిఫిను అందిం చకపోయినా 'పోనీలే అక్కడ నేనేదో తెప్పించుకుతింటాను. నువ్వు మాత్రం ఆకలితో వుండకు, ఏదన్నా చేసుకు తిను' అని చెప్పి వెళ్ళిపోతాడు

తాను వెళ్ళకపోతే అక్కడ పనులేవీ సరిగ్గా జరగవని అతని అభిప్రాయం నిజం కూడా అంతే అయిదారేళ్ళనుంచీ ఆ వుద్యోగంతో అతనికి అనుబంధం ఏర్పడిపోయింది

ఇరవై ఏళ్ళ రాజ్యం మనసు వేరు జలపాతంలా వురకలు వేస్తూ వుంది పుస్తకాలు - సినిమాలు వాటి తాలూకు అనుభూతులన్నీ వాస్తవంగా జరగాలను కుంది

ఆరోజు రాజ్యం అభిమాన నటుడి సినిమా విడుదలయింది

సరిగ్గా నాలుగింటికల్లా తయారయి కూర్చుంది

అతను రాగానే టీ అందించింది

'ఈరోజు హాస్పిటల్ మానెయ్యి మూర్తీ సినిమాకువెళదాం'' అంది

''ఈరోజు డాక్టరుగారు వూళ్ళోలేరు రాజ్యం నేనుమానేస్తే ఎట్లా కుదురుతుంది? నువ్వెళ్ళిరా'' అనేసి హడావుడిగా తయారై వెళ్తూ ''డ్రాయరుసొరుగులో పర్సుంది, తీసుకో'' అని వెళ్ళిపోయాడు

అతన్నిగమనిస్తూ వుండిపోయిందిరాజ్యం అతను గేటు దాటాక కోపం, దుఃఖం పోటీలు పడ్డాయి


వెధవరోగాలు- మందులూ తనులేక పోతే అక్కడ గడవదన్నట్టు మాట్లా డాడు. చేసేది మళ్ళా కాంపౌండరు ఉద్యోగం- ఇది ఎలాగైనా సరే మాన్పిం చాలి అనుకుంది నిరసనగా

మళ్ళా ఒకసారి ముఖం సరిగా చేసు కుని తాళం బిగించి రోడ్డుమీదికొచ్చింది ఎదురొచ్చిన రిక్షా ఆపి కూర్చుని 'నర్తకికి పోనియ్' అంది

o ooo o

ఆరోజు కావాలనే అతన్తో పోట్లాట వేసుకుంది

''ఇవ్వాళ ఏమీ తోచక ఎదురింటి ప్లీడర్ గారింటికి వెళ్ళాను. ఆవిడ మీ ఆయన ఏంపని చేస్తాడమ్మా అనిఅడిగితే చెప్పటానికి సిగ్గుతో చచ్చాను, మూర్తీ నువ్వా పాడుజాబు మానేసి మీ వూళ్ళో పొలం అమ్మేసి ఏదయినా బిజినెస్ పెట్టి బాగా సంపాయించుకోవచ్చు'' అంది




అప్పుడే భోంచేసి కుర్చీలో కూర్చున్న మూర్తి

"మా అమ్మా-నాన్నా బతికుండగా పొలం అమ్మటం కుదరదు రాజ్యం" అన్నాడు యధాలాపంగా

"పోనీ మా నాన్ననడిగి అప్పుతెస్తాను తర్వాత తీర్చెయ్యొచ్చు"

అతడు తనదారికివస్తున్నాడనుకుంది

"స్వరాజ్యం నువ్వేమనుకున్నానరే నేను చేస్తున్న పనిమీద నాకు గౌరవం వుంది అందులో నాకు ఆనందంవుంది అది మానేసి ఏవ్యాపారమో చెయ్యమంటే నావల్లకాదు" పేపరు అందుకున్నాడు

మూర్తి అంత ఖచ్చితంగా చెప్పేసరికి రాజ్యం అభిమానం దెబ్బతింది

"అయితే ఎల్లకాలం ఈ కాంపౌండర్ ఉద్యోగమే చేస్తూంటావా?" కోపంగా అడిగింది

"ఆ ఏ పనీ అసహ్యించుకోదగినదీ చెయ్యకూడనిదీ కాదు పాకీపనితోసహా" భర్తకేసి ఆశ్చర్యంగ అసహ్యంగాచూసి అక్కడ్నుంచి లేచివెళ్ళి విడిగా పక్క పరుచుకుంది ఇది జరిగాక రాజ్యం అతనితో మాట్లాడటం మానేసింది రెండ్రోజుల తర్వాత అలిగి పుట్టింటికి వెళ్ళిపోయింది రాజ్యానికిప్పుడునాలుగోనెల!

○ ○ ○ ○

రెండువారాలు గడిచినా రాజ్యం రాకపోయేటప్పటికి తనే మామగారింటికి వెళ్ళాడు మూర్తి,

ఆరోజు ఆదివారం సమయానికి చెంచయ్య ఇంట్లోనే వున్నాడు

మూర్తినిచూసి 'రావోయ్' అంటూ ఆదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టాడు

"అమ్మాయ్! మీ ఆయనొచ్చాడు కాఫీ పట్టుకురా అని కూతురికి చెప్పి అల్లుడితో మాటల్లోపడ్డాడు

చెంచయ్యకు మూర్తి అంటే చాలా

అభిమానం. మూర్తి యీ కాలపుకుర్రాడు కాదు. వేషధారణలో, ఎదుటి వాళ్ళతో మాట్లాడటంలో ఎంతో మర్యాద పాటిస్తాడు. ఒక్క దుర్గుణం కూడా లేదు

మాటల మధ్యలో రాజ్యాన్ని తీసుకెళ్లాసికి వచ్చినట్లు చెప్పాడు మూర్తి.

చెంచయ్యే లోపలికెళ్ళి కు తురతో ఆ మాట చెప్పివొచాడు.

రెండు నిముషాల తర్వాత రాజ్యం పేట్లో ఏవో టిఫిన్లతో వొచ్చి అతని ముందున్న టీపాయ్ మీద వుంచుతూ అతనికేసి చూసింది,

అప్పుడేమూర్తి రాజ్యంవంక చూశాడు.

రెప్పపాటుకాలం రెండుజతల కళ్ళూ కలుసుకుని విడిపోయాయి.

రాజ్యం లోపలికి వెళ్ళిపోయింది.

అయిదు నిముషాల తర్వాత

చిన్న అటాచితో వచ్చి నిల్చున్న రాజ్యాన్ని చూసి లేచి నిలబడ్డాడుమూర్తి'

భోంచేసి వెళ్ళమని చెంచయ్య అంటూన్నా వొద్దని మర్యాదగా తిరస్కరించి రాజ్యంతో గేటు బయటికి వొచ్చాడు.

రాజ్యం మూర్తి పక్కన నిలబడి తండ్రికి వినిపించనంత మెల్లగా''మూర్తీ వెదరు చల్లగా హాయిగా వుంది సరదాగా మాట్లాడుకుంటూ నడిచిపోదాం" అంది

"నువ్వు వొట్టి మనిషివి కాదు. ఒక్క క్షణము వుండు. యిప్పుడే వస్తా" అని రయ్యన సైకిల్ మీద వెళ్ళి రిక్షా తెచ్చాడు

రాజ్యం ఒక్కసారి అతనికేసి చూసి రిక్షా ఎక్కి కూర్చుంది.

రిక్షా ముందు- అతని సైకిలు వెనుక వెళుతూంటే గేటు బయట నిల్చుని చూస్తూన్న చెంచయ్య "నా బిడ్డని సుఖపెట్టేవాడి చేతుల్లోనే పెట్టాను" అనుకున్నాడు తృప్తిగా.

ఆరోజు రాత్రి రాజ్యం కబుర్లు వింటూ చాలాసేపు మేలుకుని వున్నాడు మూర్తి.

భర్త సాన్నిధ్యంలో పాత కోపాన్ని మరచిపోయింది రాజ్యం

ఆరాత్రి చాలా తొందరగా గడచిపోయినట నిపించింది యిద్దరికీ

రోజులు గడుస్తున్నాయి రెండు రోజులు సరిగ్గా వుంటే మూడో రోజు ఏదో విషయం అలిగి కోపగించుకుని ముభావంగా వుండి పోతుంది రాజ్యం.


"రాజ్యం! నువ్వెందుకు ఎప్పుడూ ఎలాగో వుంటావు" అడిగాడు ఒకరోజు.

"ఎలా వుంటాను ?

"ఏమో. నాకు సరిగ్గా చెప్పటంరాదు. డల్‌గా ఏదో పోగొట్టుకున్న దానిలాగా"

రాజ్యం చురుగ్గా అతని వైపు చూసింది.

"నిన్న సినిమాలకీ షికార్లకీ తీసుకెళ్ళడం లేదని కోపం కదూ. నవ్వే చెప్పు. నాకు తీరికెక్కడరాజ్యం. చాలా సార్లు ఆలోచించాను. నీకోసం యీవుద్యోగం మానేసి నువ్వు చెప్పినట్లే వ్యాపారం పెడదామని. అప్పుడు మాత్రం తీరిక వుంటుందంటావా? బాధ్యత యింకా ఎక్కువవుతుంది. పైగా ముక్కుసూటిగా పోయే నాలాటివాడు వ్యాపారంలో రాణించలేడు. మోసాలూ జిత్తులూ వుంటేగానీ వ్యాపారంలో రాణించలేం. అవన్నీ నావల్లకాని పనులు రాజ్యం.



ఒక రకంగా నేను వుద్యోగానికి బందీనై పోయాను. ఆవాతావరణం నాకు అతికి నట్టుగా సరిపోయింది. ఏరోజూ ఎనిమిదయే సరికి డాక్టరు గారికి విష్ చెయ్యక పోతే ఏమిటో వెలితిగా వుంటుంది. ఆతను చాలా మంచి మనిషి. దేవుడ్ని నమ్మడు కాని నామీదెంతో విశ్వాసం. ఆవిడకూడా చాలా మంచావిడ.

అతని మాటలకు రాజ్యం అడ్డుతగిలి "ఆవిడకేం తక్కువ. కావలసినంత డబ్బుంది. మొగుడు డాక్టరు. బాగా సంపాదిస్తున్నాడు. ఇంకా ఏం" అంది.

"రాజ్యం డబ్బొక్కటే సుఖాన్నిస్తుందనుకుంటున్నావా. ఆవిడకి డబ్బుందన్న గర్వం ఏ కోశానా లేదు. ఎప్పుడో తప్ప యిల్లు కదలదు. పుస్తకాలతో కాలక్షేపం చేస్తుందట డాక్టరుగారే చెప్పారు. "ఆవిడ సహకారం లేకుంటే నేనింత వాడ్ని అయ్యేవాడ్ని కాదు మూర్తి నేను యింతగా ఎదిగానంటే అందుకు నాభార్య కొంత కారణం" అంటారు.

రాజ్యం మాట్లాడలేదు.

"రాజ్యం. నామీద మాటిమాటికీ అలక్కు. నా సంపాదన నాది. నేనే నీ వాడ్ని. ఏది కావాలన్నా కొనుక్కో. నా పర్మిషన్ అవసరంలేదు. నేనింట్లో వున్న కాస్సేపూ నన్ను సంతోషపెడ్తూ నువ్వు సంతోషంగా వుండి. ఏం?" అంటూ రాజ్యం వొళ్ళో తలపెట్టుకుపడుకున్నాడు

రాజ్యం మౌనంగా ఆలోచిస్తూ వుండి పోయింది.

o o o o

నెలరోజులు సాఫీగా గడిచిపోయాయి. ఉదయం— మూర్తికి డ్యూటీ వేళయింది. పెన్ను కనిపించలేదు. డ్రాయర్లూ జేబులూ డ్రాయరు పొరుగులూ వెతుకుతూ "రాజ్యం నా పెన్ను చూశావా?" వంటింట్లోకి రాజ్యానికి వినపడేలా అడిగాడు

బదులు రాలేదు రాజ్యం ఆ గదిలోకి రాలేదు,

వెళ్ళేహడావుడిలో విసుక్కుంటూ 'స్వరాజ్యం'-'స్వరాజ్యం' అంటూ గట్టిగా పిల్చాడు.

"విసురుగా—సుడిగాలిలా గదిలో కొచ్చింది రాజ్యం."

"అరవకండి—ఇంత గట్టిగా—నాలుగిళ్ళకి వినపడేలా స్వరాజ్యం, స్వరాజ్యం అంటూ. ఛ. పిలవటంకూడా ఓ జూకు, అందం తెలీదు. వొట్టి సింగి"—

ఒక్క క్షణం ఆగి తెల్లబోయిచూసి, అంతలో పేపరుకింద కన్పించిన పెన్ను జేబులో వుంచుకొని హడావుడిగా గేటు దాటాడు మూర్తి.

గది మధ్యలో నిలబడిపోయింది రాజ్యం.

ఎన్నిమాటలన్నా, రెచ్చగొట్టినా అతను ఏమీ అనడు. అది నిర్లక్ష్యమో మంచి తనమో అర్థంకాదు రాజ్యానికి.

గంట తర్వాత బట్టలుసర్దుకుని రిక్షా మాట్లాడుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది-

రోజులు మాటంతట అవే గడుస్తున్నాయి.

రాజ్యం అలా వెళ్ళిపోవటం, తిరిగి తీసుకురావటం ఇద్దరికీ అలవాటయింది.

వెంచయ్య మాత్రం 'అతని మంచి తనాన్ని అలుసుగా తీసుకుని నువ్వుమాటి మాటికీ రావటం బాగోలేదమ్మా' అని మందలించాడు. సంసారంలో అభిమా

నాలూ కోపాలూ పనికిరావు సర్దుకుపోవాలని నచ్చచెప్పాడు

రాజ్యం లెక్కచెయ్యలేదు

మళ్ళా ఒకరోజు ఏదో విషయంలో తగాదా పెట్టుకుని పుట్టింటి కొచ్చింది ఆ రావటం రావటం, మళ్ళా తిరిగి మూర్తి ఇంటికి అయిదునెల్ల బిడ్డనెత్తుకుని వెళ్ళింది

ఇప్పుడు రాజ్యానికి బిడ్డతోటిదే లోకం కూతురే సర్వస్వం రోజులు దొర్లిపోతున్నాయి తన రెండేళ్ళ సంసార జీవితాన్ని సింహావలోకనం చేసుకున్న రాజ్యం నిట్టూర్చింది గట్టిగా, ఎదుటివాళ్ళ కష్టసుఖాలతో పోల్చుకున్నప్పుడే తనెంత సుఖపడ్తున్నదీ అర్థమవుతుంది.

మనిషి నైజం చిత్రమైనది ప్రతిమనిషీ ఎదుటి వారిని అంచనా వెయ్యటానికి, పరిశీలించటానికీ తనతో పోల్చి చూసుకోవటానికీ ప్రయత్నిస్తూ వుంటాడు. అయితే ఒక్కటి మాత్రం నిజం. ఎదుటి వారిని చూస్తూ కూడా తప్పొప్పులు సరిచేసుకునే ప్రయత్నం ఏ ఒక్కరూ చెయ్యరు. వారంరోజులక్రితం వరకూ రాజ్యం బాగానే వుంది. ఒకరకంగా ఆ జీవితానికి అలవాటుపడిపోయింది కూడాను

పదిరోజులక్రితం—పక్కన ఖాళీగా వున్న వాటా తలుపులు తీయించి శుభ్రం చేయించాడు ఇంటిగలాయన అందులోకి దిగారు సుందరీ సుబ్బారావూను

వాళ్ళ సరసాలూ సరదాలూ చూస్తున్న రాజ్యం గుండెల్లో అణగారి నిద్రాణమై వుండిపోయిన కోరికలూ ఆలోచనలూ మళ్ళీ తలెత్తసాగాయి తనెంత నిస్సారమైన సంసార జీవితం గడపుతూవుందో అర్థమైంది

ఒక్కనిట్టూర్పువిడిచి వాళ్ళు విరుచుకుంటూ గడియారంవైపు చూసింది 7 గంటలు కావస్తూంది లేచి పిల్లకిపాలు కలుపుకొచ్చింది నిద్రలో కదుల్తున్న పిల్లని లేపి పాలు తాగించి, కాసేపు అటూ ఇటూ తిప్పి నిద్రపుచ్చింది,

పిల్లపక్కన చాప మీద కూచుని కుప్పగా పడున్న పూలకేసిచూస్తూండిపోయింది.

సన్నజాజి మొగ్గలు తమ సహజ పరిమళాల్ని వెదజల్లుతూ విచ్చుకుంటున్నాయి

మోకాళ్ళపైన గడ్డం ఆనించుకుని కొన్ని క్షణాలు కూర్చున్న రాజ్యం మంత్ర ముగ్ధలా లేచింది

దారంవుండ తెచ్చుకుని పూలముందు కూచుంది.

మాల కట్టటం అయ్యాక గదంతా ఒకసారి కలయ జూసింది


చేతిలో పూలచెండు టేబుల్ మీదవుంచి మంచంమీది దిండు కవరూ దుప్పటీతీసి ఇస్త్రీచేసిన డాంబె డ్రైయింగ్ కవరూ, దుప్పటి వేసింది

టేబులు మీద పుస్తకాలన్నీ చక్క సర్దింది

గదిలో అస్తవ్యస్తంగా వస్తువుల్ని పాత ఆట వస్తువుల్ని యథాస్థానాల్లో వుంచింది

పెట్టెలోంచి తెల్ల గ్లాస్కో ప్రింటు వాయిలు చీర బ్లవుజు తీసుకుని ముఖం కడుక్కుందామనుకున్నదల్లా స్నానం చేసి వచ్చింది

అద్దం ముందు పావు గంట సేపు ముస్తాబయ్యింది



టేబుల్ మీద పూల చెండు ఒక్క సారి తనివి తీరా ఆఘ్రాణించి జడలో అలంకరించుకుంది

ముస్తాబు పూర్తయ్యాక ట్రాన్సిస్టర్ ఆన్ చేసింది

బాలసుబ్రమణ్యం పాట వస్తోంది వుషారుగా చీర నలక్కుండా మంచం చేర కూర్చుని గడియారంకేసి చూసింది ఎనిమిదిదాటి పది నిముషాలయ్యింది ఇంకా గంట ఆగాలంది పత్రిక అందుకుని పేజీలు తిప్పసాగింది

ఓ పేజీలో వెన్నెల కురిసిన వేళ కథకు వేసిన బొమ్మను చూస్తుండిపోయింది

ఆమె వివస్త్రగా కూర్చుని స్నానం చేస్తూవుంది యింటి వెనక చుట్టు గన్నెట్లో హఠాత్తుగా అక్కడికి వచ్చిన యువకుడు చూపు మరల్చుకోవటంమర్చి సభ్యత మర్చి చూస్తున్నాడు

పేజీలు తిప్పింది గాలో ఎగిరి పోతున్నారు యిద్దరూ చెట్టా పట్టాలు వేసుకుని

స్వేచ్ఛ కథ పేరు అనుబంధాలు సీరియల్ నవల కోసం వేసిన బొమ్మలో యిద్దరూ హత్తుకుని కూర్చుని వున్నారు

తలగడను ఆనుకుని పేజీలు తిప్పుతూంది

తలుపు కొట్టిన చప్పుడు

దిగ్గున లేచి వెళ్ళి తలుపు తీసింది ఎదురుగా మూర్తి

నవ్వుతూ అతని వైపు చూసింది

ఒక్క క్షణం ఆగిపోయి చూశాడతను

ఆమె చూపులు మరల్చుకుని కదలబోయింది

రాజ్యం పిల్చాడు

ఆమె ఆగిపోయి అతని వైపు చూసింది

(సశేషం